నిస్వార్థ ప్రజా సేవకుడు పింగళి వెంకయ్య



గోవిందరాజు వెంకటసుబ్బారావుకు అవార్డు అందజేస్తున్న బండారు దత్తాత్రేయ

చిక్కడపల్లి: నిస్వార్థ ప్రజా సేవకు ప్రతీక జాతీయ పతాక రూప కర్త పింగళి వెంకయ్య అని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. త్యాగరాయ గానసభలోని కళావేదికపై వంశీ ఇంటర్నేషనల్ నిర్వాహణలో పింగళి వెంకయ్య 148 జయంతిలో భూదానం వెంకట సుబ్బారావుగా పేరు తెచ్చుకున్న గోవిందరాజు వెంకట సుబ్బారావుకు పింగళి వెంకయ్య వంశీ జాతీయ పురస్కారాన్ని శనివారం రాత్రి ఆయన బహుకరించి మాట్లాడారు. దేశం గుర్తింపు జాతికి గర్వకారణం జాతీయ పతాకమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖులు నరసింహం, పొత్తూరి సుబ్బారావు, వంశీ రామరాజు, ఫణికశ్యప్, ప్రసన్న, రాధారాణి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

8న పండుగ సాయన్న జయంతి

కాచిగూడ: బహుజన వర్గాల ఆత్మగౌరవం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు పండుగ సాయన్న జయంతిని ఆగస్టు 8న న్యూఢిల్లీలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి తెలిపారు. బీసీ నేత, హెచ్‌యూసీ విద్యార్థి నాయకుడు శివ ముదిరాజ్ ఆధ్వర్యంలో కాచిగూడలోని హోటల్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జయంతి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యతోనే సమానత్వాన్ని సాధించవచ్చన్న విశ్వాసంతో పోరాడిన మహనీయుడు సాయన్న అని కొనియాడారు. కార్యక్రమంలో సామాజిక వేత్త డాక్టర్ డీపీ చారి, డాక్టర్ శివ ముదిరాజ్, మన్నె బ్రహ్మయ్య, సాయి కిరణ్, ఉత్న కుమార్ పాల్గొన్నారు.

13న రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వ్యవసాయ రంగాన్ని విదేశీ కార్పొరేట్లకు కట్టబెట్టె ద్వైపాక్షిక ఒప్పందాలకు వ్యతిరేకంగా ఈనెల 13న రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టనున్నట్లు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్ తెలిపారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి పాలడగు భాస్కర్, వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్‌రాములతో కలిసి శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమెరికా, బ్రిటన్‌తో చేసుకుంటున్న ద్వైపాక్షిక ఒప్పందాల వలన మన వ్యవసాయ రంగం, రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు.

ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే చర్యలు

కవాడిగూడ: ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించేలా రోడ్లకిరువైపులా అక్రమ పార్కింగ్ చేసినా.. ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేసినా చర్యలు తప్పవని గాంధీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి హెచ్చరించారు. ముషీరాబాద్ చౌరస్తా నుంచి కవాడిగూడ సీజీఓ టవర్స్ వరకు రోడ్డుకిరువైపులా చాలాకాలం నుంచి నిలిపిన వాహనాలను స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శనివారం తొలగించారు. కార్యక్రమంలో ఎస్ఐలు పెంట గౌడ్, కార్తీక్ గౌడ్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

'ఇంజినీరింగ్ సీట్ల కేటాయింపులో అవకతవకలు'

ముషీరాబాద్: తెలంగాణలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించిన బీటెక్ అడ్మిషన్ల సీట్ల కేటాయింపులో అవకతవకలు జరుగుతున్నాయని బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణా ఆరోపించారు. అమ్మాయిల రిజర్వ్‌డ్ సీట్లను అబ్బాయిలకు కేటాయిస్తున్నారన్నారు. ఓపెన్ కోటా కేటగిరిలో అమ్మాయిల సీట్లను అబ్బాయిలకు ఎలా కేటాయించారో ఎంసెట్ కన్వీనర్ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

డ్రంకన్ డ్రైవ్ తనిఖీ

చిక్కడపల్లి: వీఎస్టీ రాంనగర్ వెళ్లేదారిలో బయోలాజికల్ ఈ లిమిటెడ్ ఎక్స్ రోడ్డు వద్ద శనివారం సాయంత్రం ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వీరేశం తెలిపారు. నగర సీపీ, జాయింట్ సీపీల ఆదేశాల మేరకు ఎప్పుడైనా డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేసి కౌన్సెలింగ్ ఇచ్చి కోర్టులో హాజరుపరుస్తామని చెప్పారు. చిక్కడపల్లి ట్రాఫిక్ ఏఎస్ఐ మాల కొండల్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

కాచిగూడ: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ పి.జోనతన్ ధర్మరాజు అన్నారు. 25వ వార్షిక వైఎంసీఏ కార్గిల్ విక్టరీ స్పోర్ట్స్ ఫెస్టివల్ ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొని విజేతలైన విద్యార్థులకు శనివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లోనూ ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో జీఎం దీనదయాల్, బీజే వినయ్‌స్వరూప్, వైఎంసీఏ ప్రధానకార్యదర్శి ఎం.క్రిస్టీలీ గైస్, విద్యార్థులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో.. 55 వేల రేషన్‌కార్డుల పంపిణీ

• రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ • ముషీరాబాద్, అంబర్‌పేట్‌లో లబ్ధిదారులకు పంపిణీ



దివ్యాంగులకు రేషన్ కార్డు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే ముఠా గోపాల్



అంబర్‌పేటలో పంపిణీ చేస్తున్న మంత్రి పొన్నం, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

ముషీరాబాద్: హైదరాబాద్‌లోని 15 నియోజకవర్గాలకు చెందిన 55 వేల మంది లబ్ధిదారులకు నూతనంగా రేషన్ కార్డులు మంజూరయ్యాయని నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ముషీరాబాద్‌లోని కోషీష్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే ముఠా గోపాల్, జిల్లా కలెక్టర్ హరిచందన, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, మాజీ ఎంపీ అంజన్ కుమార్‌యాదవ్, కార్పొరేటర్లు సుప్రియానవీన్‌గౌడ్, గౌస్‌ఉద్దీన్, రవిచారి, పావనీవినయ్‌కుమార్‌తో కలిసి రేషన్ కార్డు ధ్రువీకరణ పత్రాలను శనివారం మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రానీవారు ఆందోళన చెందవద్దని ఇది నిరంతరం ప్రక్రియ అని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ.. అర్హులందరికీ రేషన్ కార్డులు అందించాలని కోరారు. కలెక్టర్ హరిచందన మాట్లాడుతూ.. కార్డు రాలేదని నిరాశ చెందవద్దని ఇంకా వెరిఫికేషన్ కొనసాగుతుందని పేర్కొన్నారు. పౌరసరఫరాల శాఖ సర్కిల్–6 ఏఎస్‌వో దీప్తి, వివిధ మండలాలకు చెందిన ఎంఆర్‌వోలు, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, బీఆర్ఎస్ ఆరు డివిజన్ల అధ్యక్షులు వై.శ్రీనివాస్‌రావు, శ్రీధర్‌రెడ్డి, వల్లాల శ్యామ్‌యాదవ్, శంకర్ ముదిరాజ్, బల్లా శ్రీనివాస్‌రెడ్డి, రాకేశ్ కుమార్, సీనియర్ నాయకులు శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, టెంట్ హౌస్ శ్రీనివాస్, టి.సోమన్, ముచ్చకుర్తి ప్రభాకర్, పెంటారెడ్డి, మాజీ కార్పొరేటర్లు ఆర్.కల్పనయాదవ్, వాజీద్ హుస్సేన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పెండం శ్రీనివాస్‌యాదవ్, రాజ్‌దీప్, మేడి సురేశ్‌కుమార్, పట్నం నాగభూషణంగౌడ్, గుర్రం శంకర్, ఎండీ మోహిన్ పాల్గొన్నారు.

బీసీ బిల్లు సాధిస్తాం

అంబర్‌పేట: తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో పోరాడి రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధిస్తామని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఛే నంబర్ చౌరస్తాలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో లబ్ధిదారులకు రేషన్ కార్డులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఢిల్లీలో బీసీ రిజర్వేషన్ల అమలు బాధ్యతను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీసుకోకుండా హైదరాబాద్‌లో ధర్నా చేయడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లు అమలయ్యాకే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని కోరారు. మాజీ ఎంపీ వీహెచ్ మాట్లాడుతూ.. తన విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం బతుకమ్మకుంట అభివృద్ధి చేసిందని, దీంతో బతుకమ్మ వేడుకలకు ఇబ్బందిలేకుండా అయ్యిందన్నారు. అలాగే ఛే నంబర్ చౌరస్తాలో మహాత్మా జ్యోతిరావు పూలే ఆడిటోరియం నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, జిల్లా కలెక్టర్ హరిచందన, ఇతర అధికారులతో పాటు కార్పొరేటర్లు, బీ.పద్మావెంకట్‌రెడ్డి, విజయ్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు శంభుల ఉషాశ్రీకాంత్‌గౌడ్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

నిరసన దీక్షకు తరలిన బీజేపీ శ్రేణులు



నిరసనలో మాజీ కార్పొరేటర్ వనం రమేశ్ తదితరులు

నల్లకుంట: కామారెడ్డి డిక్లరేషన్‌పై కాంగ్రెస్ తీరుని ఎండగట్టేందుకై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఆధ్వర్యంలో శనివారం ఇందిరాపార్క్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో నల్లకుంట మాజీ కార్పొరేటర్, బీజేపీ సీనియర్ నాయకుడు వనం రమేశ్ ఆధ్వర్యంలో నల్లకుంట నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా వనం రమేశ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ తాపత్రయం బీసీ రిజర్వేషన్ల కోసం కాదని.. ముస్లింలకు మేలు చేసేదానికని ఆయన విమర్శించారు. తరలివెళ్లిన వారిలో సీనియర్ నాయకులు శ్యామ్‌రాజ్, ఎస్. నర్సింగ్ రావు, కే లక్ష్మణ్ కుమార్, కేజే బాబు, ఎంబీ కిశోర్ కుమార్, వెంకటేశ్ గౌడ్, హిమగిరి గౌడ్, వీరయ్య గౌడ్, మురళీ ముదిరాజ్, శ్రవణ్, మల్లికార్జున్, జ్యోతి, సునీతారెడ్డి తదితరులు ఉన్నారు.

'ఎస్సీ వర్గీకరణ చట్టం-2025 ను సవరించాలి'

కాచిగూడ: ఎస్సీ వర్గీకరణ చట్టం–2025ను సవరించి మాలలతో పాటు 26 ఎస్సీ కులాలకు న్యాయం చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోపోజు రమేశ్ బాబు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శనివారం రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీల్లోని 59 కులాల్లో 26 కులాలు అంటే దాదాపు సగం కులాలకు నష్టం చేస్తున్న ఈ చట్టాన్ని, రోస్టర్ పాయింట్లను సవరించి 26 కులాలకు న్యాయం చేయాలని కోరారు. అలాగే ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని సవరించే వరకు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయవద్దని, చట్ట సవరణ తర్వాతే ఉద్యోగాల నియామక ప్రక్రియను మొదలు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



మంత్రి పొంగులేటికి వినతి పత్రం ఇస్తున్న రమేశ్ బాబు



నివాళులర్పిస్తున్న జగదాంబ తదితరులు

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి

ముషీరాబాద్: రాంనగర్ గుండు వద్ద గల పింగళి వెంకయ్య చారిటబుల్ ట్రస్ట్, స్మారక సంస్థ ప్రధాన కార్యాలయంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు కేహెచ్ఎస్. జగదాంబ, వ్యవస్థాపక చైర్మన్ కోడూరు శ్యామలరావు ఆధ్వర్యంలో జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కేంద్ర ప్రభుత్వం పింగళి వెంకయ్యకు భారతరత్న ఇవ్వాలని జెండా పుట్టిన రోజును జాతీయ పర్వదినంగా ప్రకటించాలని జగదాంబ కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి బంగారు ప్రశాంత్, సుధాకర్‌రెడ్డి, డివిజన్ బీజేపీ అధ్యక్షులు సాయికృష్ణయాదవ్, కౌండిన్య ప్రసాద్, కొండపల్లి మాధవ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పార్కును పరిశీలించిన అధికారులు



పార్కులో జీహెచ్ఎంసీ డిప్యూటీ డైరెక్టర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సుందరయ్య పార్కులో పేరుకుపోయిన సమస్యలపై జీహెచ్ఎంసీ(యూబీడీ) డిప్యూటీ డైరెక్టర్ అనిల్ కుమార్ సర్కిల్ మేనేజర్ నీరజ్ శనివారం పరిశీలించారు. గత శుక్రవారం కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ పార్కును సందర్శించి పార్కులో నెలకొన్న కొంగల బెడద, చిన్న పిల్లల ఆట వస్తువులు అపరిశుభ్రత తదితర సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పార్కు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ నిరంజన్ రెడ్డి, ఎస్ మనోహర్ రెడ్డి పార్కులోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పక్షుల మలవిసర్జన వల్ల వాకర్స్ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో పార్కు సూపర్ వైజర్ శ్యామల, వీ నాగభూషణం కల్యాణ్ నాయక్, ఎస్.రమేశ్ రెడ్డి వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించండి



ముషీరాబాద్: చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు నేతృత్వంలోని ప్రతినిధి బృందం కోరింది. ఈమేరకు రాంనగర్‌లోని తన నివాసంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయకు శనివారం వినతి పత్రం అందజేశారు.

'మంజీరా అడుగుజాడల అన్వేషణ' పుస్తకావిష్కరణ



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విప్లవ రచయితల సంఘం ఆధ్వర్యంలో వివా కామ్రేడ్ రవి రచించిన 'మంజీరా అడుగుజాడల అన్వేషణ' పుస్తకాన్ని శనివారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి, విమర్శకులు ఈకే ప్రభాకర్, విక్షణం సంపాదకుడు ఎన్.వేణుగోపాల్ మాట్లాడుతూ..మంజీరా విద్యార్థి ఉద్యమం నుంచి అంచెలంచెలుగా ఎదిగి విప్లవోద్యమానికి నాయకత్వం వహించే స్థాయికి ఎదిగిన క్రమం గురించి మేధావిగా కవిగా, కథకుడిగా ఆయన చేసిన రచనలు అభినందనీయమన్నారు. విప్లవ రచయితల సంఘం ప్రతినిధి శివరాత్రి సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విరసం కార్యవర్గ సభ్యులు పానీ, అమరుల బంధు మిత్రుల సంఘం కార్యదర్శి పద్మ కుమారి, రచయిత్రి స్నేహ, తాయమ్మ కరుణ, ఉదయ్ కిరణ్, శశిధర్, కట్టా సిద్ధార్థ, శ్రీనిధి విప్లవ శ్రీ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

ముషీరాబాద్: పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని, అలాగే వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సైకిల్ యాత్ర చేపడతామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ తెలిపారు. రాష్ట్ర కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా పారిశుద్ధ్య కార్మికుల సమస్యల సాధనకు సైకిల్ యాత్రను చేపడుతున్నామన్నారు. నెల రోజుల సైకిల్ యాత్ర ముగింపు సభ లక్షలాది కార్మికులతో ఇందిరాపార్కులో నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమానికి ప్రతిఒక్కరూ కార్మికుల డ్రెస్ కోడ్ పాటించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వరిగడ్డి చందు, గుమిడెల్లి తిరుమలేశ్, జన్నారపు జీవన్, ధర్మారపు శ్రీకాంత్, కానుగంటి సురేశ్, కొండ్ర కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ

కామర్స్ విద్యార్థులకు అవకాశాల కల్పనే లక్ష్యం



మాట్లాడుతున్న ఎరిక్ జాక్సన్ తదితరులు

కవాడిగూడ: భారతదేశంలోని కామర్స్ విద్యార్థులకు ప్రపంచవ్యాప్తంగా ప్లేస్‌మెంట్ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని బేకర్ ప్రొఫెషనల్ ఎడ్యుకేషన్ హెడ్ ఆఫ్ గ్లోబల్ సేల్ ఎరిక్ జాన్సన్ అన్నారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని మారియెట్ హోటల్లో సిమందర్, ఎడ్యుకేషన్ బేకర్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూల సంయుక్తాధ్వర్యంలో శనివారం ఫిన్నోవేషన్ కాన్ఫరెన్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బేకర్ ప్రొఫెషనల్ ఎడ్యుకేషన్ హెడ్ ఆఫ్ గ్లోబల్ సేల్స్ ఎరిక్ జాక్సన్, బేకర్ విద్యా సంస్థల అధ్యక్షుడు ఈడీ క్లార్స్, కో ఫౌండర్లు శ్రీపాల్ జైన్, పూనమ్ జైన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్లోబల్ అకౌంటింగ్ కెరియర్‌లో కామర్స్ విద్యార్థులకు విస్తృత ఉద్యోగావకాశాలు కల్పించేందుకు సిమందర్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్‌తో అమెరికాకు చెందిన బేకర్ విద్యాసంస్థలు సీపీఏ, పీఎంఎ, కోర్సుల్లో అంతర్జాతీయ స్థాయిలో నైపుణ్యత సాధించేందుకు ఒప్పందం చేసుకుందన్నారు. భారత్‌లో ప్రపంచవ్యాప్తంగా గుర్తించబడిన అకౌంటెంట్లకు పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చేందుకు బేకర్, సిమందర్ ఎడ్యుకేషన్ విద్యా సంస్థల ఒప్పందం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

నాలాను అభివృద్ధి చేయండి



మంత్రికి వినతి పత్రం ఇస్తున్న కార్పొరేటర్లు విజయ్‌కుమార్‌గౌడ్, పద్మ

అంబర్‌పేట: మోయిన్ చెరువు నాలా అభివృద్ధికి చొరవ చూపాలని కోరుతూ కార్పొరేటర్లు విజయ్‌కుమార్‌గౌడ్, పద్మావెంకట్‌రెడ్డి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. నియోజకవర్గంలో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన మంత్రిని కలిసి నాలా సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పనులు ప్రారంభించినప్పటికీ పూర్తి చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

ఆరెకటికల సమస్యల్ని సీఎం దృష్టికి తీసుకెళ్తా



ఆరె కటిక సంఘం ఉపాధ్యక్షుడు శేఖర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కాలేరు

కాచిగూడ: రాష్ట్రంలోని ఆరె కటికల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, అవసరమైతే సీఎం దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. ఆరె కటిక సంఘం (సూర్యవంశీ) ఉపాధ్యక్షుడిగా కాచిగూడకు చెందిన సబ్‌నేకార్ శేఖర్ ఎన్నికైన సందర్భంగా ఆయనను ఎమ్మెల్యే శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరె కటికలు కొన్నేళ్లుగా సమస్యలతో సతమతమవుతున్నారని, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కాచిగూడ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్, ఆరె కటిక సంఘం ఉపాధ్యక్షుడు సబ్‌నేకార్ శేఖర్ పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

కాచిగూడ: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందని సైయెంట్ వ్యవస్థాపక చైర్మన్, పద్మశ్రీ డాక్టర్ బీవీఆర్ మోహన్ రెడ్డి అన్నారు. భద్రుకా కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ ఆర్ట్స్ 75వ వ్యవస్థాపక దినోత్సవాన్ని కాచిగూడలోని కళాశాల ఆడిటోరియంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్య భారతదేశ అభివృద్ధికి మూలస్తంభం అని, భవిష్యత్తు భారతాన్ని తీర్చిదిద్దేందుకు ఇది అత్యంత శక్తివంతమైన సాధనమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించాలని, నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేయాలని, సమాజంలో నైతికతతో కూడిన బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. కళాశాల కార్యదర్శి శ్రీకిషన్ భద్రుకా, డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ ఎస్.అభిరామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, సాంకేతిక రంగ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



పద్మశ్రీ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డిని సత్కరిస్తున్న శ్రీకిషన్ భద్రుకా, డాక్టర్ మోహన్ కుమార్

ఉద్యోగ నోటిఫికేషన్లు లేకపోవడంపై నిరసన

చిక్కడపల్లి: జాబ్ క్యాలెండర్ విడుదలై ఏడాది గడిచినప్పటికీ ఒక్క నోటిఫికేషన్ కూడా విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ గాంధీనగర్‌లోని కెనరా బ్యాంక్ పార్కులో శనివారం వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా నిరుద్యోగి దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ.. గతేడాది ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగ ప్రకటన విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులు రవి, వెంకటేశ్ పాల్గొన్నారు.



బహుజన్ రాజ్యాధికార పార్టీలో చేరిక

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలో బహుజన రాజ్యాధికార పార్టీలో పలువురు యువకులు శనివారం చేరగా ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జన్ను సాంబయ్య, ప్రధాన కార్యదర్శి బుర్రి సాగర్ వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బహుజనులకు రాజ్యాధికారం దక్కినప్పుడే సామాజిక న్యాయం చేకూరుతుందన్నారు. రాష్ట్రంలోని దళిత బహుజన ఉద్యమ నాయకులు బహుజన ప్రజలకు చేసిందేమి లేదని విమర్శించారు. బహుజనుల ఓట్లను అధిపత్య కులాల పార్టీలకు మళ్లించి పబ్బం గడుపుకునే వారిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పిసరి రజిత, రమేశ్, రాజేశ్, మేకల విజయ్ కుమార్, సామర్ల రమేశ్, ఎండీ సాహిద, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



నేడు రేణుకా ఎల్లమ్మ బోనాలు



ముస్తాబైన రేణుకా ఎల్లమ్మ ఆలయం

నల్లకుంట: నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి చౌరస్తా సమీపంలో గల రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం (నేడు) నిర్వహించనున్న శ్రావణ మాస బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ అధ్యక్షుడు కుతాడి రవి కుమార్ తెలిపారు. శనివారం ఆలయం ప్రాంగణంలో ఆలయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి నర్సింగ్ రావు, సలహాదారు చంద్రయ్య, నగేశ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. యంగ్ మెన్స్, లోకల్ లారీ అసోసియేషన్ల ఆధ్వర్యంలో నిర్వహించనున్న బోనాల వేడుకల్లో ఉదయం అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. అనంతరం ఆలయ కమిటీ తరపున అమ్మవార్లకు తొలి బోనం నైవేద్యంగా సమర్పించిన అనంతరం భక్తులు బోనాలు సమర్పిస్తారన్నారు. అలాగే వాహన పూజలు కూడా ఉంటాయని పేర్కొన్నారు. వేడుకలకు కేంద్రమంత్రి జీ కిషన్ రెడ్డి, మాజీ ఎంపీ వీ హనుమంతా రావు, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సీ రోహిణ్ రెడ్డితో పాటు ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు హాజరుకానున్నట్లు చెప్పారు.

భక్తుల తాకిడి అధికంగా ఉంటుందని, ఆలయ పరిసర ప్రాంతాల్లో భక్తులెవరూ తమ వాహనాలను నిలపవద్దని వారు కోరారు. సమావేశంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కేఎం రాజు, ఎం.నాగరాజు గౌడ్, ఎం.భాస్కర్ యాదవ్ పాల్గొన్నారు. బీజేపీ సీనియర్ నాయకుడు భువనగిరి సురేశ్ యాదవ్ ఆధ్వర్యంలో సాయంత్రం తొట్టెల ఊరేగింపు ఉంటుంది.



కొలువుదీరిన రేణుకా ఎల్లమ్మ అమ్మవార్లు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010463222